క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన



నల్లమాడలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నల్లమాడ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం)పై తహసీల్దార్ దేవేంద్రనాయక్ ప్రజలకు అవగాహన కల్పించారు. చారుపల్లి, యర్రవంకపల్లి, వేళ్లమద్ది, కొండక్రింద తండా, రెడ్డిపల్లి, వంకరకుంట, నల్లమాడ గ్రామాల్లో శనివారం గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించారు. ఈవీఎం పనితీరు, ఎన్నికల్లో ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనే విషయాలను తెలియజేశారు.

పుట్టపర్తి: బుక్కపట్నంలో శనివారం రెవెన్యూ అధికారులు ఈవీఎంలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఓ హర్షవర్ధన్, వీఆర్ఓ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇత్తడి పూజా సామగ్రి వితరణ



వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఇత్తడి పూజా సామగ్రి అందిస్తున్న దాతలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ముదిగుబ్బ మండలం ఎనుములవారిపల్లికి చెందిన బెస్త హరి, విజయలక్ష్మి దంపతుల సహకారంతో పట్టణానికి చెందిన బెస్త శ్రీనివాసులు కుటుంబ సభ్యులు శనివారం రూ.9600 విలువ చేసే ఇత్తడి పూజా సామగ్రిని వితరణ చేశారు. బెస్త నారాయణస్వామి, వెంకటరాముడు, రామకృష్ణయ్య, గంగమ్మ, సుశీలమ్మ, చంద్రకాంత్ పాల్గొన్నారు.

విరాళం అందజేత



చెక్కు అందజేస్తున్న జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: ఫిబ్రవరి 5,6,7 తేదీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించే అనంత బాలోత్సవం పిల్లల పండుగ నిర్వహణకు ధర్మవరం పట్టణానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ ఆర్థిక విరాళం అందించింది. బాలోత్సవ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి సావిత్రికి ఆ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి రూ.20వేలు అందించారు. రమణయ్య, భూతన్న, జశ్వంత్, కృష్ణజ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

నల్లమాడ: ఏపీటీఎఫ్ 2024 సంవత్సర క్యాలెండర్‌ను శనివారం నల్లమాడలో ఎంఈఓ వేమనారాయణ ఆవిష్కరించారు. జీఓల సంపుటిని ఎంఈఓ–2 సురేష్‌బాబు ఆవిష్కరించారు. ఆదిబయన్న, వెంకట్రామిరెడ్డి, రవిశంకర్, నరసింహుడు, రమేష్‌బాబు, నాగేంద్రనాథ్, మహబూబ్‌బాషా, ప్రకాష్, రామలింగారెడ్డి, సైపుద్దీన్, సరస్వతమ్మ, సుమలత, నాగవాణి పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎమ్మార్సీలో శనివారం ఏపీటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీలను ఎంఈఓ గోపాల్‌నాయక్, హెచ్ఎం ఉమాపతి ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నకే పట్టం కడదాం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



చిల్లకొండయ్యపల్లిలో సంక్షేమ పథకాల గురించి ఆరాతీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

తాడిమర్రి: జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దాడితోట, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. నవరత్నాల పథకాల అమలుపై ఇంటింటా ఆరా తీశారు. దాడితోటలో పూర్తయిన సీసీ రోడ్లు, మంచినీటి ట్యాంకులు, గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, నాడు నేడు కింద అదనపు గదులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో సంక్షేమ పథకాల ఊసే లేదన్నారు. పింఛన్లు కూడా జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే ఇచ్చే వారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత ఉన్నవారందరికి పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న విద్యా దీవెన, రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ పింఛన్ కానుక ఇలా అనేక సంక్షేమ పథకాలను జగనన్న అందించారన్నారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం నుంచి తాడిమర్రి మీదుగా దాడితోట వరకు సుమారు రూ.7 కోట్లు వెచ్చించి డబల్ రోడ్డు నిర్మించారన్నారు. దాడితోట–పెద్దకోట్ల మధ్య కొండపై రూ.2,400 కోట్లతో అదాని గ్రూపు గ్రీన్ ఎనర్జీ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని, వందలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కల్లిబొల్లి మాటలు నమ్మి మోసపోకుండా మీకు మంచి చేసిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు వెంకటలక్ష్మమ్మ, పద్మావతి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ యర్రగంగు కృష్ణమనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వర్థ, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, సచివాలయాల మండల కన్వీనర్లు అల్లే సాయినాథ్‌రెడ్డి, మల్లప్పగారి మాధవరెడ్డి, నాయకులు గరుడమ్మగారి రూపేష్‌రెడ్డి, వైస్ సర్పంచ్ హరినాథ్‌రెడ్డి, గద్దె రాజేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవు, జొల్లిరెడ్డి రామన్న, జొల్లిరెడ్డి కిష్ట, సల్లాపురం బాలరమణారెడ్డి, యలక శ్రీనివాసరెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు, మారక శివారెడ్డి, తిమ్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సర్పచులు వెంకటనారాయణరెడ్డి, నారాయణస్వామి, ఎంపీడీఓ విజయలక్ష్మీ, పీఆర్ ఏఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ లక్ష్మీ, ఏఓ రమాదేవి, ఏపీఓ సంజీవరెడ్డి, ఏపీఎం సాంబశివుడు, ఎస్ఐ నాగస్వామి పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే రహదారులకు మోక్షం

- సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: 30 ఏళ్లుగా జరగని అభివృద్ధి జగనన్న పాలనలో కేవలం 55 నెలల్లోనే జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ధనియానిచెరువు పంచాయతీలో కదిరి – రాయచోటి ప్రధానరహదారి నుంచి గోవిందురాజుల పల్లి గ్రామానికి రూ.64 లక్షల ఏపీఆర్‌ఆర్‌పీ నిధులతో 545 మీటర్ల మేర నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ బీటీ, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. గతంలో 104, 108 వాహనాలు కూడా వెళ్లడానికి వీలు లేని మారుమూల పల్లెలకు సైతం జగనన్న పాలనలో చక్కటి రహదారలు నిర్మించామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా కనీస రహదారి సౌకర్యంలేని 140 గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లను సీఎం జగనన్న సహకారంతో నిర్మించినట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున చంద్రబాబు అండ్‌కో ఎన్నో హామీలతో మీ ముందుకు వస్తారని, వారిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధికి చిరునామాగా నిలిచిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎంపీపీ ఈటెరాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, సర్పంచ్ దిల్షాద్, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్లు కృష్ణారెడ్డి, బయారెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ జయరామిరెడ్డి, సీనియర్‌నాయకుడు రామచంద్రారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవయ్య, పీఆర్‌పీఏయూ ఎఈఈ రాజేంద్రప్రసాద్, విశ్రాంత వీఆర్‌ఓ ఓబుళరెడ్డి, అల్లాబక్షు, శివారెడ్డి, చెన్నకేశవరెడ్డి, గోవిందునాయక్, వాసుదేవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి

- బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పరామర్శ



కొడపగానిపల్లిలో జగన్‌మోహన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

పుట్టపర్తి టౌన్: బాధితులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కొత్తచెరువు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకున్న లోచర్ల గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, అనారోగ్యంతో బాధపడుతున్న రామిరెడ్డి భార్య అనసూయమ్మను ఎమ్మెల్యే పరామర్శించారు. వారి ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన కొడపగానిపల్లి గ్రామానికి చెందిన జగన్‌మోహన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం నూరిపోసి ఆర్థిక సాయం అందించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, శంకర్, ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచ్‌లు లింగమయ్య, రఘునాథ్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, నరసింహారెడ్డి, చౌరెడ్డి, భాస్కర్ తదితరలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'వికసిత్ భారత్'

ధర్మవరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఆదివారం నుంచి జనవరి 2 వరకు పట్టణంలో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన 17 పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.

శుభ కార్యానికి హాజరైన ఎమ్మెల్యే



వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డి ఇంటిలో శనివారం జరిగిన శుభకార్యానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆయన సతీమణి సుప్రియ హాజరయ్యారు. గృహ ప్రవేశంతో పాటు చిన్నారి ఫంక్షన్ ఘనంగా జరిగింది.

రైతుల సంక్షేమమే 'తోపుదుర్తి' ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



బాలేపాళ్యం వద్ద కాటమచెరువులో రైతులతో కలసి గంగ పూజ చేస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

కనగానపల్లి: పుష్కలమైన సాగునీటి ద్వారా పంటలు బాగా పండించుకొని రైతులు సంతోషంగా ఉండటమే 'తోపుదుర్తి' ధ్యేయమని రాప్తాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం బాలేపాళ్యం సమీపంలోని కనగానపల్లి కాటమచెరువులో స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలసి గంగపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతన్నల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి, హంద్రీనీవా కాలువ నుంచి పిల్లకాలువను ఏర్పాటుచేసి, కాటమచెరువు నింపారన్నారు. ఈ చెరువు నిండి మరువపారుతుండటంతో కనగానపల్లి, బాలేపాళ్యం, కోనాపురం గ్రామాల్లోని రైతులకు సాగునీటి సమస్య తీరనుందన్నారు. తోపుదుర్తి ట్రస్టు ద్వారా రైతులకు ఉచితంగా బోర్లు వేయించి, రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు.

బాధితులకు పరామర్శ: బాలేపాళ్యం వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులను తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. అధైర్యపడొద్దని ఆయన వారిని ఓదార్చారు. మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచులు దాసిరెడ్డి, రామకృష్ణ, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు పెద్దిరెడ్డి, ఆలమూరప్ప, రామలింగారెడ్డి, శ్రీకాంత్, గోపాల్, రామ్మోహన్‌రెడ్డి, రవి, శీనా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా మళ్లీ ఎగరేద్దాం

- ఓటు అడిగేందుకు వచ్చే టీడీపీ నాయకులనూ నిలదీయండి
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: రాబోవు ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తామని చెప్పి, తన కొడుకు లోకేష్‌కు తప్ప.. ఎవరికీ ఇవ్వలేదన్నారు. రైతు, డ్వాక్రా రుణాల మాఫీ ఇలా ఎన్నో హామీలిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ఇలాంటి కపట మోసగాళ్లు ఎన్నికలు రాగానే మళ్లీ ప్రజల్లోకి వస్తారన్నారు. గ్రామాల్లోకి వస్తే వాళ్లను నమ్మవద్దని, మీరేం చేశారని నిలదీయాలన్నారు. ఈప్రాంతంలో కొన్నేళ్లుగా పరిటాల కుటుంబ సభ్యులే మంత్రి పదవులు, ఎమ్మెల్యేలుగా కొనసాగారని, బడుగు వర్గాల సంక్షేమాన్ని విస్మరించి, దోచుకొని, దాసుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అధికారులను బెదిరించి, చేయని పనులకు బిల్లు చేసుకున్నారన్నారు.

కపట మోసగాళ్లు చంద్రబాబు, పవన్, సునీతను నమ్మవద్దు

పరిటాల కుటుంబ కబంధ హస్తాల్లో ఉన్న ముత్యాలమ్మ గుడిని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడమేకాక, త్వరలోనే రామగిరి బంగారు గనులను తెరిపించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో పవన్‌కళ్యాణ్ అనే నటుడు చంద్రబాబును గెలిపించుకునేందుకే తిరుగుతున్నాడన్నారు. లోకేష్, ఆయన ఎప్పటికీ లీడర్లు కాలేరని, చంద్రబాబు అస్తమిస్తున్న సూర్యుడని, వారికి ఇవే చివరి ఎన్నికలన్నారు. టీడీపీతో ప్రజలు విసిగిపోయి, వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారన్నారు. సీఎం జగనన్న పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. తాము పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీరు తీసుకురావడంతోపాటు అన్ని చెరువులకూ నీరు అందించినట్లు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో రాప్తాడుతోపాటు రామగిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని, మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ గోసే నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ ముత్యాలు, సర్పంచ్‌లు మీనుగ నాగరాజు, నరేంద్ర, రాజేష్, సిద్ధన్న, చెన్నకేశరెడ్డి, ఓబిరెడ్డి, రామ్మూర్తి, నాయకులు నరసింహారెడ్డి, ఆదిరెడ్డి, మల్లికార్జున, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు గ్రామాల్లో సాగైన కంది పంటలో అధికారులు శనివారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. 14–1బి సర్వే నంబర్‌లో వై.సరస్వతి, సర్వే నంబర్ 554–1బిలో మంగమ్మ సాగు చేసిన కంది పంటలో ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ, వీహెచ్ఏ చరితలు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ధర్మవరం డివిజన్ ఏడీఏ కృష్ణయ్య పర్యవేక్షించారు. కంది పంటను వారం రోజులు ఎండబెట్టిన తర్వాత కాయలు తొలగించి దిగుబడిని అంచనా వేస్తామని తెలిపారు. ఓరియంటల్ ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ నాగభూషణ, రైతులు పాల్గొన్నారు.

స్టార్టర్, కేబుల్ చోరీ

నల్లమాడ: తన పొలంలో బోరుబావికి అమర్చిన విద్యుత్ స్టార్టర్, కేబుల్ వైరు శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఎస్.బడవాండ్లపల్లికి చెందిన రైతు గంగాధర్‌రెడ్డి తెలిపారు. గతంలో కూడా కేబుల్ వైరు చోరీకి గురైందన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసినట్లు రైతు పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి

నల్లమాడ: పంటల సాగులో శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని అధికారులు రైతులకు సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయ క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీ మాస్ ప్రాజెక్టు మేనేజర్ గోపాలరాజు, మండల వ్యవసాయాధికారి సుమతి, మండల ఉద్యానవన అధికారి నవీన్‌కుమార్, ఏరువాక అధికారులు రామసుబ్బయ్య, శశికళ, మహేష్ పాల్గొన్నారు. రైతు సంఘాల ద్వారా ఉపయోగం, మామిడి, వేరుశనగ, మొక్కజొన్న పంటల యాజమాన్య పద్ధతులు, మార్కెట్ సౌకర్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరికరాలు, వివిధ రకాల విత్తనాలు, పశువుల దాణా, సేంద్రియ ఎరువులు, చిరుధాన్యాల స్టాల్స్ ఏర్పాటు చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా మా కక్షిదారుడయిన బొమ్మినేని నారాయణస్వామి, తండ్రి: బి.పెద్దన్న, వెంకటాపురం గ్రామం, బత్తలపల్లి మం॥ అను వారు 1) పూజారి కొండన్న, 2) పి.రమాదేవి, 3) ఎ.ప్రభాకర్‌రెడ్డి, 4) సి.రాజగోపాల్‌రెడ్డి, 5) సి.నారాయణరెడ్డి, 6) పూజారి రామచేంద్ర, 7) పి.బి.రామమోహన్‌నాయుడు, 8) సి.ఇంద్రసాయిరెడ్డి, 9) పి.శ్రీనాథ్‌రెడ్డి గార్లపై మహారాజశ్రీ అనంతపురం మొదటి అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మీద O.S.No: 31/2023 దావా వేసియున్నారు. సదరి దావా హైకోర్టులో పెండింగులో ఉన్నది. అందులకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరైన ఎటువంటి లావాదేవీలు కానీ, క్రయ, విక్రయాలు కానీ, ఏ ఇతరత్రా జరిపిన అవి చట్టరీత్యా చెల్లనేరవు. ఒకవేళ ఎవరైన అతిక్రమించినచో అటువంటి వారిపైన మా కక్షిదారుడు తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెల్పడమైనది.

షెడ్యూలు

Land Situated in Bathalapalli Village fields SRD of Dharmavaram RD of Hindupur (Old) and at Present RD of Srisathya Sai Dist.

Babu	Sy. No.	Extent	Extent
Govt. Dry	213-1	A.C. 5.40 Cents out of this A.C.	3.60

Bounded by: East: Land of Gadiputi Lakshmaiah, **South:** Kadiri Road, **West:** Smasanam, **North:** Land of Chitra Narayana


P.Krishna Swamy Kumar, Advocate, Anantapuramu
P.Lakshminarayana, Advocate, Dharmavaram
9441081584, 9948106576

సంక్షిప్త సమాచారం

12 వరకు అభ్యంతరాల స్వీకరణ

ధర్మవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు నమోదు కార్యక్రమంతోపాటు అభ్యంతరాల స్వీకరణకు జనవరి 12వరకు గడువు పొడిగించినట్లు తహసీల్దార్ యుగేశ్వరిదేవి శనివారం తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారం–6,7,8లలో నూతనంగా ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు, బదిలీలకు నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్, బీఎల్ఓల ద్వారా వచ్చిన వాటిని గడువులోపు విచారణ చేసి జనవరి 22వతేదిన ఓటరు జాబితాను ప్రకటించనున్నామని తెలిపారు.

సత్యసాయికి సంగీత నీరాజనం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ మృదు మధుర స్వరాలొలికిస్తూ సాగిన స్వరార్చణ సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది. సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ లర్నింగ్ మ్యూజిక్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయి ప్రేమ తత్వాన్ని సేవా నిరతిని కీర్తిస్తూ సంగీత విభావరి సాగింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో చోరీ

తలుపుల: ఓబులరెడ్డిపల్లి సమీపంలోని వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు చొరబడి సీసీ కెమెరాలు, రూ.15వేల విలువైన ఇతర వస్తు సామగ్రిని చోరీ చేశారు. ఎస్ఐ మగ్బుల్ బాషా, పోలీసు సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు.

వలంటీర్‌కు చేయూత

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి చిన్న తండాకు చెందిన గ్రామ వలంటీర్ చంద్రానాయక్‌కు న్యూలైఫ్ లోడింగ్ చారిటబుల్ ట్రస్ట్ చేయూత ఇచ్చింది. చంద్రానాయక్ క్యాన్సర్ సోకడంతో ఇటీవల మేజర్ ఆపరేషన్ చేయించుకున్నారు. పరిస్థితిని గమనించిన ట్రస్టు నిర్వాహకులు ఆయనకు శనివారం రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు.

ఒంటరి మహిళలకు అండగా ఉండాలి

బత్తలపల్లి: భర్త చనిపోయి అనేక కట్టుబాట్లు, ఆంక్షల మధ్య జీవిస్తున్న ఒంటరి మహిళ పట్ల వివక్ష చూపొద్దని బత్తలపల్లి ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లి ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో సింగిల్ మదర్స్‌డే నిర్వహించారు. వారు మాట్లాడుతూ భర్తలుచనిపోయిన వాళ్లు జీవితమంతా మోడుగానే బతుకుతూ అవమానానికి కూడా గురవుతున్నారని అలాంటి మహిళలకు అండగా నిలవాలన్నారు. ఏటీఎల్ రుక్మాంగద, సంజీవ్‌కుమార్, సీఓలు నాగరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

పుట్టపర్తి: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు మండల వ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం బుక్కపట్నం మండలం సిద్దరాంపురం పంచాయతీ, లింగప్పగారిపల్లిలో క్రికెట్ పోటీలను సర్పంచ్ రమణయ్య ప్రారంభించారు. రంగస్వామి టీమ్ విజయం సాధించింది. మల్లేష్ పాల్గొన్నారు.

బత్తలపల్లి: బత్తలపల్లి ఆర్డీటీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ కోటి సుధ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

బత్తలపల్లి: ఎస్సీ, ఎస్టీలకు ఎలాంటి సమస్యలున్నా, ఎవరి చేతిలోనైనా అన్యాయానికి గురైనా పోలీసులను ఆశ్రయించాలని బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. పౌర హక్కుల రక్షణపై గంటాపురం ఎస్సీ కాలనీలో సర్పంచు అక్కిం దామోదర్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్ఐ హాజరై మాట్లాడారు. పెత్తందార్లు వెట్టి చాకిరీ చేయించినా, దౌర్జన్యాలకు పాల్పడినా బాలకార్మికులు వేధింపులకు గురైనా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

పథకాలను వినియోగించుకోండి

బత్తలపల్లి: అప్పరాచెరువు, సంగాల గ్రామ సచివాలయాల ఆవరణలో సర్పంచులు మొర్రెడ్డిగారి శారదమ్మ, కంచనగారి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమంలో భాగంగా గ్రామసభలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీపీ బగ్గిరి త్రివేణి, ఎంపీడీఓ సాయిమనోహర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శిబిరంతో పాటు వంటగ్యాస్‌పై కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈఓఆర్డీ దివాకర్, ఎంఈఓ సుధాకర్‌నాయక్, వైద్యాధికారి రామకృష్ణ, సీహెచ్ఓ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఏఓ ఓబిరెడ్డి, చంద్రమ్మపాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

కదిరి అర్బన్: బూరుగుపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆదివారం ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రకాష్ శనివారం తెలిపారు.

గుండెపోటుతో మృతి

తనకల్లు: వైకేపీలో తవళం, సీఆర్‌పల్లి, ముండ్లవారిపల్లి, గేమేనాయక్‌తండాలకు సీసీగా పనిచేస్తున్న ముదిగుబ్బ మండలం పాడరాళ్లపల్లికి చెందిన ఈశ్వరయ్య(48) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ధర్మవరం అర్బన్: వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం శనివారం సాయంత్రం ప్రధాన కూడళ్లలో పర్యటించారు. రోడ్డుకు మధ్యలో ద్విచక్రవాహనాలు నిలిపిన వారికి హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా మా కక్షిదారులైన **శ్రీమతి బాలం సాహితి, భర్త బి. రాజేష్,** నివాసం డోర్ నెం. 10–3–17, నాగులబావి వీధి, ధర్మవరం టౌన్, శ్రీ సత్యసాయి జిల్లా, వారి తరఫున యావన్మందికీ తెలియజేయడమేమనగా! షెడ్యూల్‌లో కనపరచిన ఆస్తి, **చెడిపోతుల నాగేంద్రమ్మ, భర్త ఈశ్వరయ్య,** నివాసం డోర్ నెం. 5/112, బి.సి.కాలనీ, పోట్లమర్రి గ్రామం, బత్తలపల్లి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అనువారి స్వయార్జితమైన ఆస్తిని విక్రయించదలచినారు. మా కక్షిదారులైన **శ్రీమతి బాలం సాహితి, భర్త బి. రాజేష్** కొనదలచి పై వారితో క్రింది కనపరచిన షెడ్యూల్ ఆస్తిని ఎకరా ఒకటికి రూ. 58,00,000/- ప్రకారం ధర ఏర్పాటు చేసుకొని మొత్తం భూమి ఎ.సి. 2.19 సెంట్లను మొత్తం కలిపి రూ. 1,27,02,000/- (అక్షరాల ఒక కోటి ఇరవై ఏడు లక్షల రెండు వేల రూపాయలకు) విక్రయించుటకు ఏర్పాటు చేసుకొని **31-07-2023** తేదీ నాడు మా కక్షిదారురాలు **శ్రీమతి బాలం సాహితి** గారి నుండి అడ్వాన్సుగా నగదు రూ. 32,00,000/- (అక్షరాల ముప్పై రెండు లక్షల రూపాయలు), **చెడిపోతుల నాగేంద్రమ్మ, భర్త ఈశ్వరయ్య గారు** తీసుకొని అదే దినము విక్రయ అగ్రిమెంటు చేసి ఉన్నారు. మిగతా బ్యాలెన్సు డబ్బులు చెల్లించి స్వంత ఖర్చులు భరించి రిజిష్టర్ విక్రయం చేసుకొనుటకు మా క్లయింట్ అయిన **శ్రీమతి బాలం సాహితి గారు చెడిపోతుల నాగేంద్రమ్మ గారిని** పలుమార్లు పిలిచినా రాకుండా కాలయాపన చేయడం వలన నా క్లయింట్ అయిన **బాలం సాహితి గారు** అడ్వకేట్ గారి ద్వారా **01-12-2023** తేదీన **చెడిపోతుల నాగేంద్రమ్మ గారు** బ్యాలెన్సు డబ్బులు తీసుకొని రిజిష్టర్ విక్రయం చేయించమని లీగల్ నోటీస్ పంపడమైనది. పై విషయములన్నీయు దాచిపెట్టి **చెడిపోతుల నాగేంద్రమ్మ భర్త ఈశ్వరయ్య** గారు **జ్వాల బాలనరసింహారెడ్డి, అలియాస్ బాల తండ్రి బుడ్డప్పగారి నరసింహారెడ్డి,** పోట్లమర్రి గ్రామం, బత్తలపల్లి మండలం, శ్రీ సత్యసాయి జిల్లా అనువారితో లాలూచిపడి మా కక్షిదారురాలైన **బాలం సాహితి** గారి హక్కులను కాలరాయాలని దొంగపత్రములను సృష్టించదానికి ప్రయత్నం చేస్తున్నట్లు మా కక్షిదారుదారులకు తెలిసినది. మా కక్షిదారులైన **శ్రీమతి బాలం సాహితి, భర్త బి. రాజేష్ గారికి** కోర్టు ద్వారా విక్రయం పొందదానికి సర్వహక్కులు కలిగి ఉన్నారు. కావున షెడ్యూల్ దాఖలా ఆస్తికి సంబంధించి ఎవరూ **చెడిపోతుల నాగేంద్రమ్మ** గారితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదని ఖండితముగా తెలియజేయుచున్నాము. కాదని ధిక్కరించి షెడ్యూల్ ఆస్తికి సంబంధించి ఎవరైనా **చెడిపోతుల నాగేంద్రమ్మ** గారితో ఎలాంటి క్రయవిక్రయాలు గాని, లావాదేవీలుగానీ జరపకూడదని ఇందుమూలముగా తెలియజేయడమైనది. అతిక్రమించిన యెడల వారిపై చట్టరీత్యా తగిన సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకోబడునని తెలియజేస్తున్నాము.

షెడ్యూలు

శ్రీ సత్యసాయిజిల్లా, పుట్టపర్తి రి.డి., ధర్మవరం సబ్.రి.డి., బత్తలపల్లి గ్రామ పొలం మరియు పంచాయితీ ఏరియాలో గల జమీనుకు వివరం.

బాబు	స.నెం.	విస్తీర్ణం
న.తరీ ఈదులవంక	368-2	ఎ.సి.2.19(రెండు ఎకరముల పంతొమ్మిది సెంట్లు)

చెక్కుబంది : తూర్పు : శ్రీశైలం సీతారామప్పగారి భూమి ; **పడమర :** జ్వాలా రెడ్డి గారి భూమి; **ఉత్తరం :** కె. వరదారెడ్డి గారి భూమి; **దక్షిణం :** ఎర్రామల్ల కొండారెడ్డి గారి భూమి.

యన్. జయరామ్, అడ్వకేట్, అనంతపురము
సెల్ : 9440781337.